సాక్షి
నిజామాబాద్
శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



'బాధ్యత' మరిస్తే ప్రమాదకరమే
ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతను అలవర్చుకోవాల్సిన అవసరం ఉంది. మెరుగైన సమాజానికి మనవంతు కృషి చేయాలి.
- 8లో ▸



దళారులతో కుమ్మక్కు
దళారులతో పాలకులు, అధికారులు కుమ్మక్కై పసుపు రైతులను మోసం చేస్తున్నారని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.1 /16.2

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



ఇందల్వాయి: నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు సమ్మర్ యాక్షన్ చేపట్టినట్లు జిల్లా విద్యుత్‌శాఖ టెక్నికల్ డీఈ రమేశ్ తెలిపారు. సిర్నాపల్లి సబ్‌స్టేషన్‌లో రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు ఎక్స్‌టెన్షన్లు, రెండు బ్రేకర్లు, గౌరారం నుంచి సిర్నాపల్లి సబ్‌స్టేషన్ వరకు రూ.69 లక్షలతో చేపట్టిన 33 కేవీ లింక్‌లైన్ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. నల్లవెల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఒక 100 కేవీ, మూడు 25కేవీల ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి డీఈ ఉత్తం జాడే, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ జ్ఞానేశ్వర్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సుభాష్‌నగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి శనివారం జిల్లాకు వస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ పట్టణంలోని రమాకాంత్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ పట్టభద్రులతో నిర్వహించే సమావేశంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కేంద్రమంత్రితోపాటు ఎంపీ ధర్మపురి అర్వింద్ పాల్గొంటారని తెలిపారు.

లింగ నిర్ధారణ చేయొద్దు


- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ



నిజామాబాద్‌నాగారం: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ హెచ్చరించారు. జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అన్ని ప్రమాణాలు పాటిస్తూ అర్హతలు ఉన్న స్కానింగ్ సెంటర్లకు మాత్రమే రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేస్తామన్నారు. గర్భిణులకు స్కానింగ్ చేసి పుట్టబోయే శిశువు ఆడ లేదా మగ అని తెలియజేస్తే చట్టప్రకారం స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. అర్హత గల డాక్టర్ రిఫరల్ స్లిప్పు లేనిదే అబార్షన్ కోసం వాడే ఔషధాలను విక్రయించొద్దని మెడికల్ షాపులకు సూచించారు. స్కానింగ్ సెంటర్లలో రికార్డులు, రిపోర్టులను క్రమం తప్పకుండా నమోదు చేయాలన్నారు. భ్రూణ హత్యలు, ఆడపిల్లల ప్రాధాన్యత, బేటీ బచావో బేటీ పఢావోపై విస్తృత అవగాహన కల్పించాలని ఐకేపీ, మెప్మాలతోపాటు వైద్య సిబ్బందికి సూచించారు. సమావేశంలో రేడియాలజిస్ట్ డాక్టర్ ద్వితీ, పిల్లల వైద్యులు పి ప్రసన్న, గైనకాలజిస్ట్ డాక్టర్ బి బిందు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుప్రియ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ, వెంకటేశ్వర్లు (ఆరోగ్య చైతన్య వేదిక ఘన్‌పూర్), మాధురి (మెప్మా), డెమో నాగలక్ష్మి, డీహెచ్‌ఈ వేణుగోపాల్, దేవేందర్ పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్‌పై సీరియస్

రెవెన్యూ అధికారులు జారీ చేసిన వే బిల్లు





ఇసుక క్వారీ వద్ద టిప్పర్ల యజమానులు, డ్రైవర్లతో మాట్లాడుతున్న రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్



ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్

- సాక్షి కథనానికి స్పందించిన అధికారులు
- ఖండ్‌గాం ఇసుక క్వారీ పరిశీలన
- ఉల్లంఘనలపై ఉదయం అధికారుల హెచ్చరికలు
- మధ్యాహ్నం యథావిధిగా ఓవర్‌లోడ్‌తో వెళ్లిన ఇసుక టిప్పర్లు
- నియంత్రణపై నేడు సబ్ కలెక్టర్ సమక్షంలో సమావేశం

బోధన్ : నిబంధనలు అతిక్రమిస్తూ ఇసుక తరలించడంపై సాక్షి జిల్లా పేజీలో 'ఓవర్ లోడ్' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బోధన్ మండలంలోని సిద్ధాపూర్–ఖండ్‌గాం గ్రామాల మధ్య ఉన్న ఇసుక క్వారీని రోడ్డు రవాణా శాఖ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్, బోధన్ ఎంవీఐ శ్రీనివాస్, తహసీల్దార్ విఠల్ పరిశీలించారు. క్వారీ నుంచి పరిమితికి మించి టిప్పర్లల్లో ఇసుక రవాణా చేస్తుండటంపై సీరియస్ అయ్యారు. ఓవర్‌లోడ్ చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. క్వారీ వద్ద నుంచే బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోను ఫోన్‌లో సంప్రదించి పరిస్థితిని వివరించారు. దీంతో ఓవర్‌లోడ్ అంశంపై శనివారం సబ్ కలెక్టర్ సమక్షంలో రోడ్డు రవాణా, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంవీఐ శ్రీనివాస్ తెలిపారు.

అభివృద్ధి పనుల కోసమే..

బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి, రెంజల్, బోధన్ మండలాల్లో అభివృద్ధి పనుల కోసం సిద్ధాపూర్– ఖండ్‌గాం గ్రామాల మధ్య మంజీర నదిలో ఇసుక క్వారీకి ప్రభుత్వం అనుమతించింది. ఈ క్రమంలో నిజామాబాద్ రూరల్ ప్రాంతానికి కూడా ఇసుక తరలించేందుకు రెవెన్యూ అధికారులు వే బిల్లులు ఇస్తున్నారు. ఒక్కో టిప్పర్‌లో 10 క్యూబిక్ మీటర్ల(15 టన్నులు) ఇసుక లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే టిప్పర్ బాడీని ఇనుపరేకులు, కర్ర చెక్కలతో పెంచి పెద్ద మొత్తంలో ఇసుక తరలిస్తున్నారు. కాగా, క్వారీ వద్ద వే బిల్లులు జారీ చేసేందుకు మండల రెవెన్యూ అధికారి ఒక్కడే ఉండటం విశేషం.

సాక్షి ఎఫెక్ట్..



ఖండ్‌గాం ఇసుక క్వారీ లోంచి ట్రాక్టర్ల ద్వారా తెచ్చిన ఇసుకను టిప్పర్లలో లోడ్ చేస్తున్న వాహనాలు

శాఖల మధ్య సమన్వయ లోపం

ఇసుక రవాణా విషయంలో దృష్టి సారించాల్సిన వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపమే అక్రమార్కులకు రాచమార్గంగా మారినట్లు చర్చ జరుగుతోంది. దీంతో ప్రభుత్వాదాయానికి భారీ గండిపడుతోంది. నిర్దేశిత సరిహద్దులు దాటి వస్తున్నా ఇసుక టిప్పర్ల విషయంలో మైనింగ్ శాఖ అధికారుల్లో చలనం లేకుండా పోయిందని ఓ శాఖ డివిజన్ అధికారి చెప్పుకొచ్చారు. క్వారీ వద్దనే ఇసుక లోడ్ తూకం వేస్తే ఓవర్‌లోడ్‌కు చెక్ పెట్టొచ్చని ఆర్టీవో అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గేదేలే..

ఇసుక క్వారీని సందర్శించిన అధికారులు ఓవర్ లోడ్‌పై హెచ్చరించినా వ్యాపారులు వెనక్కి తగ్గడం లేదు. అధికారులు క్వారీ నుంచి వెళ్లగానే యథావిధిగా ఇసుక ఓవర్ లోడ్‌తో టిప్పర్లు బయలుదేరాయి. అధికారుల హెచ్చరికలనూ పట్టించుకునే పరిస్థితులు కనిపించడం లేదు. కాగా, శుక్రవారం డీడీలు కట్టిన 61 టిప్పర్లలో ఇసుక రవాణా చేసేందుకు రెవెన్యూ అధికారులు వే బిల్లులు జారీచేశారు.

ఫిర్యాదు చేశాం

- నిజామాబాద్ లారీ ఓనర్స్, బిల్డింగ్ మెటీరియల్స్ అసోసియేషన్

ఖలీల్‌వాడి: పరిమితికి మించి ఇసుక తరలింపుతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని ఇన్‌చార్జి సీపీ కార్యాలయంతోపాటు ఆర్టీఏ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు నిజామాబాద్ లారీ ఓనర్స్, బిల్డింగ్ మెటీరియల్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, లింగారెడ్డి పేర్కొన్నారు. ఇదే అంశాన్ని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మీడియాతో మాట్లాడారు. 10 టన్నులు తరలించే టిప్పర్‌లో 25 నుంచి 28 టన్నుల ఇసుక తరలిస్తున్నారని, దీంతో ఒక్క ట్రిప్పునకు రూ. 6వేల నుంచి 8వేల వరకు ఆదాయం తగ్గుతోందని తెలిపారు. సమావేశంలో పవన్‌రెడ్డి, శివారెడ్డి, నాగేశ్, ఎస్‌కే ఖయ్యూం, ఇమ్రాన్ మాజార్ పటేల్, నర్సింహ, నవీన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న అధ్యక్షులు రవి, ప్రధానకార్యదర్శి లింగారెడ్డి

సాక్షి కథనంపై ప్రస్తావన

ఇసుక ఓవర్‌లోడ్‌పై సాక్షిలో వచ్చిన వార్తా కథనాలు వాస్తవమేనని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఇసుక అక్రమ తరలింపుపై అధికారులు చర్యలు తీసుకోవాలంటూ వాట్సాప్ గ్రూపులలో 'సాక్షి' కథనాన్ని పోస్టు చేశారు.

వే బిల్లు ఒకటి.. ట్రిప్పులు నాలుగు

ఖలీల్‌వాడి : ప్రభుత్వం నుంచి ఒక్క వే బిల్లు తీసుకొని.. నాలుగు టిప్పర్ల ఇసుకను తరలిస్తున్నారు ఇక్కడి వ్యాపారులు. ఇసుక వ్యాపారులంతా రింగ్‌గా ఏర్పడి అనుమతికి మించి ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిద్ధాపూర్ వద్ద గల ఖండ్‌గాం క్వారీ, మందర్నా క్వారీ నుంచి ఒక్కో టిప్పర్‌లో 10 టన్నుల ఇసుక తరలింపునకు వ్యాపారులు మీ సేవలో రూ.4వేల వరకు వే బిల్లు చెల్లిస్తారు. కానీ, టిప్పర్‌కు పైన చెక్కలు అమర్చి 25 టన్నుల వరకు ఇసుక తోడేస్తున్నారు. అధికారులతో టిప్పర్ల యజమానులు మిలాఖత్ అవ్వడంతోనే ఇష్టారీతిన ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ దందాపై అటు రెవెన్యూ, ఇటు పోలీసు అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. బోధన్ రూరల్, సాలూరా, నవీపేట, ఎడపల్లి, 6వ టౌన్, ఐదో టౌన్‌ల మీదుగా పరిమితికి మించి ఇసుక తరలిస్తున్న టిప్పర్లతో ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేస్తే ఎస్సైలు లేరని సిబ్బంది చెప్పడం కొసమెరుపు.

ఇసుక కోసమే ఓ పోలీస్ అధికారికి బదిలీ

జిల్లాలో పనిచేసే ఓ పోలీస్ అధికారి ఇసుక ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం కోసమే రాజకీయ నాయకుని పైరవీతో అక్కడికి బదిలీ చేయించుకున్నట్లు పోలీసువర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సదరు పోలీసు అధికారిని ఇసుక వ్యాపారులు ముందుగానే కలవడంతో ఇసుక అక్రమ వ్యాపారాన్ని పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి.

ఒక్క వే బిల్లుపైనే ఇసుక

ఒక్క వే బిల్లు మీదనే ఇసుకను అందిస్తున్నాం. ఒకేదాని మీద రెండు, మూడు వెళ్లడం లేదు. టిప్పర్ల లైన్ రావడానికే సమయం పడుతుంది. నిబంధనల మేరకు ఇసుక తరలింపునకు అనుమతిస్తున్నాం. – విఠల్, తహసీల్దార్, బోధన్

పరిమితి కంటే ఎక్కువ తరలింపు

పరిమితి కంటే ఎక్కువగా ఇసుకను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అధికారులు ఇప్పటికైనా దృష్టిసారించాలి. – లింగారెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, నిజామాబాద్

కన్యాదానం చేసి.. కన్నుమూశాడు

- పెళ్లి మండపంలో వధువు తండ్రికి గుండెపోటు
- ఆస్పత్రికి తరలింపు.. పరిస్థితి విషమించి మృతి
- పెళ్లింట తీవ్ర విషాదం



పెళ్లిలో కూతురికి బొట్టు పెడుతున్న బాల్‌చంద్రం

భిక్కనూరు : 'బాల్‌చంద్రం.. అప్పుడే బాధ్యత తీరిందా..?' కుటుంబాన్ని మించిన బాధ్యత లేదని, ఇద్దరు కూతుళ్లను ఉన్నత చదువులు చదివించావు. బిడ్డల ఉద్యోగాలు, పెళ్లిళ్లపై ఎన్నో కలలు కన్నావు. పెద్దబిడ్డను ఓ అయ్య చేతిలో పెట్టిన కొద్ది సేపట్లోనే కన్నుమూశావు. నిన్నే నమ్ముకున్న భార్య, నీ మార్గదర్శనంలో పెరిగిన మరో బిడ్డ పరిస్థితి ఏమిటి? వారికి దిక్కెవరు? అంటూ ఆ పెళ్లికి వచ్చిన వారు పచ్చని పందిరిలో రోదించిన తీరు కలిచివేసింది. కన్యాదానం చేసి కానరాని లోకాలకు వెళ్లిపోయాడు ఆ తండ్రి. ఈ హృదయవిదారక ఘటన భిక్కనూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది.

భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లికి చెందిన కుడిక్యాల బాల్‌చంద్రం (55) కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో నివసిస్తున్నాడు. చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆయనకు భార్య రాజమణి, ఇద్దరు కూతుళ్లు కనకమహాలక్ష్మి, కళ్యాణలక్ష్మి ఉన్నారు. పిల్లలిద్దరూ పీజీ పూర్తి చేసి గ్రూప్–1 మెయిన్స్ రాశారు. శుక్రవారం భిక్కనూరు బీటీఎస్ చౌరస్తాలో ఉన్న ఓ ఫంక్షన్ హాలులో బాల్‌చంద్రం పెద్ద కూతురి పెళ్లి జరిగింది. కాళ్లు కడిగి కన్యాదానం చేసిన కొద్ది సేపటికి బంధుమిత్రులతో ముచ్చటిస్తూ బాల్‌చంద్రం కుప్పకులాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని కామారెడ్డిలోని హౌసింగ్‌బోర్డులో ఉన్న ఇంటికి చేర్చారు. పెళ్లికి వచ్చిన అతిథులే అంత్యక్రియలకు హాజరయ్యారు. ఎన్నో ఆశలతో అత్తారింట్లో అడుగుపెట్టాల్సిన కూతురు తండ్రి మరణంతో కన్నీరుమున్నీరైంది. భార్యతోపాటు రెండో కూతురు తమకు దిక్కెవరంటూ రోదించసాగారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రచార వేడి

పోలింగ్‌కు మిగిలింది ఐదురోజులే..

- ఆత్మీయ సమ్మేళనాలతో హడావుడి
- మొత్తం ఓట్లు 27,088 మాత్రమే.. కూడికలు, తీసివేతలతో అభ్యర్థులు
- కులాల వారీగా ఓట్ల సమీకరణలు చేస్తున్న ఉపాధ్యాయులు
- మల్క కొమరయ్య రాజకీయ పార్టీ అభ్యర్థి కావడంతో పెరిగిన ఆసక్తి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఐదు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. రెండు రకాల ఎన్నికలు కావడంతో సహజంగానే అత్యధిక ఓటర్లుండే పట్టభద్రుల ఎమ్మెల్సీ పోటీ విషయమై హడావుడి ఎక్కువగా జరుగుతూ వచ్చింది. అలాగే పోలింగ్ సమీపిస్తుండడంతో పరిమిత సంఖ్యలో ఓట్లు ఉన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక విషయమై ఉపాధ్యాయులు, సంఘాల్లో హడావుడి నెలకొంది. ఉపాధ్యాయ ఓట్లు మొత్తం 27,088 ఉన్నాయి. ఇందులో ఉమ్మడి కరీంనగర్‌లో 8,384, మెదక్‌లో 7,249, నిజామాబాద్‌లో 5,762, ఆదిలాబాద్‌లో 5,693 ఓట్లు ఉన్నాయి. ఓటర్లలో పురుషులు 16,932 మంది, మహిళలు 10,156 మంది ఉన్నారు. ఈ నెల 27న పోలింగ్ జరుగనుంది. బరిలో మొత్తం 15 మంది అభ్యర్థులు ఉన్నారు. అయితే ఒక రాజకీయ పార్టీ తరఫున ఉన్న అభ్యర్థి ఒక్కరే కావడం గమనార్హం. జాతీయ పార్టీ బీజేపీ నుంచి విద్యావేత్త మల్క కొమరయ్య పోటీలో ఉన్నారు. కాగా మల్క కొమరయ్య, పీఆర్‌టీయూ బలపరిచిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, ఎస్‌టీయూ, సీపీఎస్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ మద్దతుతో బరిలోకి దిగిన సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, టీపీటీఎఫ్, యూటీఎఫ్, యూఎస్‌పీసీ బలపరిచిన అశోక్ కుమార్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వీరితో పాటు మరో 11 మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు.

కులాల వారీగా సమీకరణలు..

పోలింగ్‌కు కౌంట్‌డౌన్ నడుస్తున్న నేపథ్యంలో విందులు, ఆత్మీయ సమ్మేళనాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఉపాధ్యాయులు కులాల వారీగా విడిపోయి అభ్యర్థుల గెలుపోటములను నిర్దేశించేవిధంగా పావులు కదుపుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీ కులగణన చేసిన నేపథ్యంలో బీసీ వాదంతో అత్యధిక మంది ఉపాధ్యాయులు ప్రచార పర్వాన్ని నడిపిస్తున్నారు. దీంతో మల్క కొమరయ్యకు బీసీ ఉపాధ్యాయుల నుంచి మద్దతు వస్తోంది. మరోవైపు బీజేపీ అభ్యర్థి కూడా కావడంతో మల్క కొమరయ్య గెలుపు కోసం సంఘ్‌పరివార్ భారీగా కసరత్తు చేస్తోంది. పీఆర్‌టీయూ అభ్యర్థిగా బరిలో ఉన్న వంగ మహేందర్‌రెడ్డి గట్టి పోటీ ఇస్తున్నప్పటికీ ఇదే సంఘం నుంచి గత ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలుపొందిన సిట్టింగ్ అభ్యర్థి కూర రఘోత్తంరెడ్డి భారీగా ఓట్లను చీల్చనున్నట్లు పలువురు విశ్లేషిస్తున్నారు. ఉపాధ్యాయుల మధ్య కులాల వారీగా డివిజన్ వచ్చిన నేపథ్యంలో బీజేపీ తరఫున అభ్యర్థిగా ఉన్న కొమరయ్యకు కలిసొస్తుందని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. బీసీ కులగణన నేపథ్యంలో ఈ వాదం సైతం తమకు కలిసొస్తుందని బీజేపీ కార్యకర్తలు అంటున్నారు. మరోవైపు వంగ మహేందర్‌రెడ్డి, కూర రఘోత్తంరెడ్డి, అశోక్‌కుమార్ సైతం తమకే అవకాశాలున్నాయనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఓటర్ల వివరాల పట్టిక..

జిల్లా	మొత్తం ఓటర్లు
కుమురం భీం ఆసిఫాబాద్	470
మంచిర్యాల	1664
ఆదిలాబాద్	1593
నిర్మల్	1966
నిజామాబాద్	3751
కామారెడ్డి	2011
జగిత్యాల	1769
పెద్దపల్లి	1111
కరీంనగర్	4305
రాజన్న సిరిసిల్ల	950
సంగారెడ్డి	2690
మెదక్	1347
సిద్దిపేట	3212
హన్మకొండ	166
జయశంకర్ భూపాలపల్లి	83
మొత్తం	27,088

బీసీ గురుకులాల్లో చికెన్, గుడ్లు బంద్

- కోళ్లకు వైరస్ ప్రభావంతో నిలిపివేత
- విద్యార్థులకు సీజనల్ పండ్ల పంపిణీ



మోర్తాడ్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

మోర్తాడ్(బాల్కొండ): కోళ్లకు సంక్రమిస్తున్న వైరస్ కారణంగా మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు భోజనంలో చికెన్, గుడ్లను వడ్డించడం నిలిపివేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు వెల్లడిస్తున్నారు. మూడు వారాల నుంచి చికెన్, గుడ్లను పెట్టడం లేదని చెబుతున్నారు. ప్రతి ఆదివారం చికెన్ వడ్డించాల్సి ఉండగా మటన్ భోజనం అందిస్తున్నారు. మెనూ ప్రకారం రోజూ మధ్యాహ్నం ఉడికించిన కోడిగుడ్డును తప్పనిసరిగా అందించాల్సి ఉండగా, గుడ్డుకు ప్రత్యామ్నాయంగా రోజుకో విధమైన సీజనల్ పండ్లను అందజేస్తున్నారు. వైరస్ అదుపులోకి వచ్చే వరకు మెనూలో మార్పులు చేసినట్లు ప్రిన్సిపాళ్లు పేర్కొంటున్నారు. కాగా, కస్తూర్బా, బీసీ, ఎస్సీ విద్యార్థి వసతి గృహాల్లో మాత్రం కోడిగుడ్లను యథావిధిగా వడ్డిస్తున్నారు.

మెనూలో మార్పులు చేశాం

విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మెనూలో మార్పులు చేశాం. ఉన్నతాధికారుల సూచన మేరకు కోడిగుడ్ల స్థానంలో పండ్లను పంపిణీ చేస్తున్నాం. పరిస్థితి చక్కబడిన తర్వాత పాత మెనూ ప్రకారం చికెన్, కోడిగుడ్లు అందిస్తాం.

– ప్రసాద్, ప్రిన్సిపల్, బీసీ గురుకుల పాఠశాల, మోర్తాడ్

నాటు కోడిగుడ్డు @ రూ.25



ఆర్మూర్: పౌల్ట్రీ ఫాం కోళ్లకు వైరస్ వస్తుందనే ప్రచారం విస్తృతం కావడంతో చికెన్, గుడ్ల అమ్మకాలు తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో నాటుకోళ్లతోపాటు కోడిగుడ్లతో భోజనం చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో నాటుకోడి గుడ్డు ధరకు రెక్కలు వచ్చాయి. పౌల్ట్రీఫాం కోడిగుడ్డు ధర రూ.5కు పడిపోగా, నాటుకోడి గుడ్డు ధర రూ.25కి ఎగబాకింది. మరోవైపు ఆర్డర్ మెస్‌ల కోసం పెంచుతున్న గిరిరాజ్ తరహా కోళ్ల గుడ్డు ధర కూడా రూ.20 నుంచి రూ.25 వరకు పలుకుతుండటం విశేషం.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సమీక్ష



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్ : శాసనమండలి ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్‌రెడ్డి, ఇతర ఎన్నికల అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్షలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాల్గొన్నారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సుల తరలింపు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లకు కీలక సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులతో మాట్లాడారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సదుపాయాలను సరి చూసుకోవాలని తెలిపారు. సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత నడుమ కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్‌కు తరలించాలని ఆదేశించారు. వీసీలో ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, అదనపు డీసీపీ కె రామచంద్రారావు, ఏసీపీ రాజావెంకటరెడ్డి, డీటీడబ్ల్యూవో నాగురావు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

‘బాధ్యత’ మరిస్తే ప్రమాదకరమే

- చట్టాలను అతిక్రమిస్తే కటకటాలే..
- ఇబ్బంది పెట్టొద్దు.. ఇరుకున పడొద్దు
- సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి



ఖలీల్‌వాడి: మన సంతోషం.. ఎదుటివారికి ప్రమాదకరం కావొద్దు. మనం చేసే పనులు.. ఎదుటి వారి ప్రాణాలు పోయేంతలా ఉండకూడదు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతను అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తల్లిదండ్రులు బాధ్యత మరిస్తే పిల్లలకే కాదు సమాజంపై కూడా ప్రభావం పడుతుంది. ఇతరులను ఇబ్బంది పెట్టకుండా బాధ్యతతో మెలిగితే మెరుగైన సమాజానికి మనవంతు కృషి చేసినవారమవుతాం. అదే బాధ్యతను విస్మరించి చట్టాలను అతిక్రమిస్తే ఎంతటి వారైనా జైలు ఊచలు లెక్కించాల్సిందే.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు

భారత వివాహ చట్టం ప్రకారం యువతులకు 18 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలి. కానీ, 18 ఏళ్ల లోపు వివాహం చేస్తే దానిని బాల్య వివాహం అంటారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరం. బాలికను వివాహం చేసుకుంటే శిక్షార్హులవుతారు. బాల్య వివాహాన్ని ప్రోత్సహించిన వారితోపాటు పెళ్లి చేయించే పురోహితుడిపైనా చర్యలు తీసుకుంటారు.

భద్రత నియమాలు మరువొద్దు

ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తారు. రాత్రి సమయంలో కుప్పలుగా చేసి వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులు రాత్రివేళ ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నిసార్లు మృతి చెందిన ఘటనలూ ఉన్నాయి. రహదారులపై ధాన్యం ఆరబెడితే చట్టప్రకారం శిక్షలు తప్పవు. ధాన్యానికి ఇరువైపులా సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అదేవిధంగా రహదారులపై వాహనాలు నిలిపినప్పుడు వెనక నుంచి వచ్చే వాహనాలకు కనిపించేలా పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేయాలి. లేకపోతే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే పరిస్థితి వస్తుంది. దీంతో వాహనం నిలిపిన వ్యక్తులు కేసులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

సోషల్ మీడియాతో జర జాగ్రత్త

స్మార్ట్ ఫోన్లు వచ్చిన తర్వాత సోషల్ మీడియా వాడకం ఎక్కువైంది. చాలా మంది సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని నిజనిర్ధారణ చేసుకోకుండా ఇతరులకు పంపించి ఇబ్బందులపాలవుతున్నారు. రెండువర్గాల మధ్య విద్వేషాలు కలిగేలా, వ్యక్తిగతంగా కించపరిచినా, సున్నితమైన అంశాలపై స్పందించినా జైలు ఊచలు లెక్కించాల్సి ఉంటుంది.

మైనర్లు.. డ్రైవింగ్ వద్దు

మోటారు వాహనచట్టం ప్రకారం 18ఏళ్లు నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ పొంది వాహనాలు నడపాలి. మైనర్లు వాహనం నడుపుతూ పోలీసులకు దొరికితే రూ.500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ప్రమాదం జరిగితే తల్లిదండ్రులతోపాటు వాహన యజమానిపై కేసు నమోదు చేస్తారు. చట్టప్రకారం దీనికి 10 ఏళ్ల జైలుశిక్షతోపాటు జరిమానాకు అవకాశం ఉంది.

బాధ్యత అందరిదీ..

బాల్యవివాహం చట్టవిరుద్ధం. నిర్ణీత వయస్సులోనే యువతీయువకులకు పెళ్లి చేయాలి. లేకుంటే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటాం. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడంతో వాహనాదారులు ప్రమాదాలకు గురై వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. సోషల్ మీడియాలో అనవసర పోస్టులు పెడితే అడ్మిన్‌తోపాటు పోస్టు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తాం. సామాజిక బాధ్యతతో నడుచుకోవాలి.

– రాజావెంకట్‌రెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

బేస్‌బాల్ ప్రాబబుల్స్ జట్ల ఎంపిక

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం జిల్లా బేస్‌బాల్ సబ్ జూనియర్ బాలుర ప్రాబబుల్స్ జట్టును ఎంపిక చేసినట్లు బేస్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి సొప్పరి వినోద్ తెలిపారు. క్రీడాకారులకు శిక్షణనిచ్చి తుది జట్టును ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 2 వరకు గజ్వేల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో తుదిజట్టు పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పూర్ణచందర్‌రావు, వైస్ ప్రిన్సిపల్ సాయన్న, సాఫ్ట్‌బాల్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, పీడీ జ్ఞానేశ్వర్, పీఈటీ రాజేందర్, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ నరేశ్ పాల్గొన్నారు.

సుద్దపల్లిలో బాలికల జట్టు..

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా బేస్‌బాల్ సబ్ జూనియర్ బాలికల ప్రాబబుల్స్ జట్టును ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ మధుసూదన్ రెడ్డి, సొప్పరి వినోద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణులకు ఈ నెల 23 నుంచి 27వరకు శిక్షణనిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నళిని, సీనియర్ వైస్ ప్రిన్సిపల్ స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ వనిత, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, సంయుక్త కార్యదర్శి మర్కంటి సుజాత, పీడీ జ్యోత్స్న, పీఈటీలు బీ వీణ, శ్రీలత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వీ మౌనిక పాల్గొన్నారు.





ఎంపికైన జిల్లా బేస్‌బాల్ సబ్ జూనియర్ బాలుర ప్రాబబుల్స్ జట్టు .. బాలికల ప్రాబబుల్స్ జట్టుతో ప్రిన్సిపల్ నళిని, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

క్లుప్తంగా

సేవాలాల్ చూపిన మార్గం ఆచరణీయం



తెయూ(డిచ్‌పల్లి): బంజారాల ఆరాధ్యదైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం ఆచరణీయమని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు అన్నారు. తెయూ కంప్యూటర్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ సెల్, బంజారా ఎంప్లాయిస్ అసోసియేషన్, గిరిజన శక్తి విద్యార్థి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతిని వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, అవుసుల తండాకు చెందిన లక్ష్మీబాయి ఏర్పాటు చేసిన బంజారా ఆభరణాల ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వీసీ యాదగిరిరావు, గౌరవఅతిథిగా రిజిస్ట్రార్ యాదగిరి, విశిష్ట అతిథిగా ప్రిన్సిపాల్ ఆరతి హాజరయ్యారు. ముందుగా సేవాలాల్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి బోగ్ బండార్, పూజలు నిర్వహించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. దేశంలో బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలు గొప్పవని కొనియాడారు. అధ్యాపకులు కనకయ్య, ప్రవీణ్, చంద్రశేఖర్, సంపత్, ఆంజనేయులు, రాంబాబు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో కుటుంబాలు విచ్ఛిన్నం



నిజామాబాద్‌నాగారం: ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాల (మాదకద్రవ్యాలు) వల్ల ఎన్నో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని, ఎంతోమంది విద్యార్థులు తమ జీవితాలను చేతులారా నాశనం చేసుకుంటున్నారని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. నగరంలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమానికి శుక్రవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల మీద అవగాహన విద్యార్థి దశ నుంచే ప్రారంభం కావాలని, ప్రతి ఒక్కరూ ఈ విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు, వైద్యులు విశాల్, నాగరాజు, మల్లేష్, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఎంఎంపీటీఎఫ్ పక్కాగా అమలుకు కృషి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: యూఎన్‌వో ద్వారా ప్రయోగాత్మకంగా నిజామాబాద్ జిల్లాలో అమలు చేయనున్న మైగ్రేషన్ మల్టీ పార్టనర్ ట్రస్ట్ ఫండ్ (ఎంఎంపీటీఎఫ్) కార్యక్రమాన్ని పక్కాగా పూర్తి చేయుటకు సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. కార్యక్రమం అమలు విషయమై కేంద్ర ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాస్థాయి కమిటీ సభ్యులతో శుక్రవారం సమీక్ష జరిపారు. కార్యక్రమం ఉద్దేశ్యం, పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాను ఎంపిక చేయడానికి గల కారణాలు, ఎంఎంపీటీఎఫ్‌ను అమలు చేయాల్సిన విధానం, యూఎన్‌వో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందించే తోడ్పాటు తదితర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో వలసదారులు, దుర్బల కుటుంబాల స్థితిగతుల గురించి కలెక్టర్ తెలిపారు. వారి స్థితిగతులలో మార్పును ఆశిస్తూ అమలుచేయుటకు సంకల్పించిన పైలెట్ ప్రాజెక్టును జిల్లాలో సమర్థవంతంగా అమలయ్యేలా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఏవో హుస్సేన్, ఆయా శాఖల అధికారులు శ్రీనివాస్, రసూల్‌బీ, జగన్నాథ చారీ, శ్రీనివాస్, ప్రదీప్, ఏవోలు నర్సయ్య, వెంకటేష్, యూఎన్‌వో సభ్యులు జగన్మోహన్, లిస్సీ జోసెఫ్, స్వచ్ఛందసంస్థల సభ్యులు అనిల్, వాసిల్ ఉన్నారు.

దళారులతో పాలకవర్గం, అధికారులు కుమ్మక్కు

- పసుపుబోర్డు నామమాత్రమే
- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో దళారులు, పాలకవర్గం, అధికారులు కుమ్మక్కయి పసుపు రైతులను మోసం చేస్తున్నారని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.13000 ధర పలికే పసుపును రూ.10 వేల వరకే కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ వెంటనే మార్కెట్ కమిటీని పరిశీలించి రైతులను ఆదుకోవాలని అన్నారు. పసుపు రైతులకు మద్దతు ధర అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎంపీ అర్వింద్ నామమాత్రపు పసుపు బోర్డును తీసుకువచ్చారన్నారు. పసుపు బోర్డు చైర్మన్ తన గ్రామానికే పరిమితమైనట్లు ఎద్దేవా చేశారు. సాంగ్లీ మార్కెట్‌ను అనుసంధానం చేసి పసుపు ధరను పెంచాలన్నారు. గంజ్ మార్కెట్‌లో దళారుల ప్రమేయం తగ్గించాలన్నారు. లేదంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటానికి దిగుతామన్నారు. గత బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా అందించాలని అప్పటి కాంగ్రెస్ నాయకులు నేటి మంత్రులు డిమాండ్ చేశారని కానీ ప్రస్తుతం వారు ఎల్‌ఆర్‌ఎస్‌కు డబ్బులు వసూలు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఎ హలీం ఉన్నారు.

పెండింగ్ బిల్లులు, డీఏలు ఇప్పిస్తాం



నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులు క్లియర్ చేయించడంతోపాటు మూడు డీఏలను ఇప్పిస్తామని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్టీయూ ఏ రాజకీయ పార్టీ పక్షాన చేరలేదని, కేవలం ఉపాధ్యాయుల కొరకే పని చేస్తుందన్నారు. ఈక్రమంలో సంఘం తరపున ఎమ్మెల్సీ ఎన్నికల్లో వంగ మహేందర్ రెడ్డి పోటీ చేస్తున్నాడని, అతడిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నాయకులు దామోదర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, కిషన్ పాల్గొన్నారు .

విద్యావేత్తలు కాదు.. వ్యాపారవేత్తలు

నిజామాబాద్‌నాగారం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే కార్పొరేట్ అభ్యర్థులు డబ్బుల కట్టలతో టికెట్ తెచ్చుకున్నారని, వారు విద్యావేత్తలు కాదని, వ్యాపారవేత్తలని ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేసి నా కాంగ్రెస్ ఖాతాలోకే పోతుందని హెచ్చరించారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే తనకు మండలిలో అవకాశం ఇస్తే పట్టభద్రుల హక్కుల కోసం పోరాడుతానని భరోసా ఇచ్చారు. తేజ్‌దీప్‌రెడ్డి కోమటిరెడ్డి, రాజుగౌడ్, అజహరుద్దీన్, రాము ఉన్నారు.



అదృశ్యమైన తల్లీకొడుకుల ఆచూకీ లభ్యం



రుద్రూర్: కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన జ్యోతి, తన ఏడాదిన్నర కుమారుడితో కలిసి ఈ నెల 5న అదృశ్యం కాగా, పోలీసులు వారి ఆచూకీ గుర్తించి, పట్టుకొని శుక్రవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. జ్యోతి దివ్యాంగురాలు కాగా అదృశ్యమైన రోజునే కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలించగా వారు కరీంనగర్‌లో ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఆయిల్, కాపర్ వైర్లు చోరీ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ కళ్యాణ్ శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

మాచారెడ్డి: పాల్వంచ మండలం లొట్టివాగు సమీపంలో పేకాట స్థావరంపై దాడిచేసి పేకాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.7,150 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

కారును ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

- ఒకరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండల పరిధిలోని బీబీపూర్ శివారులోగల జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. డిచ్‌పల్లి ఎస్‌ఐ ఎండీ షరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్‌లోని ముజాయిద్ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్లా రహమాన్ (25), మహమ్మద్ షహీద్, మొయినుద్దీన్ ఖాన్, సయ్యద్ అయూబ్ అలీ కలిసి గురువారం ఉదయం కారులో హైదరాబాద్‌కు వెళ్లారు. అర్ధరాత్రి తిరిగి నిజామాబాద్‌కు బయలుదేరగా, తెల్లవారుజామున బీబీపూర్ శివారులో వారి కారును వెనుకనుంచి వేగంగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన కారు రహదారిపై బోల్తా పడింది. ఈఘటనలో కారులోని నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్నపోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. షేక్ అబ్దుల్లా మృతి చెందగా, పరిస్థితి విషమంగా ఉన్న సయ్యద్ అయూబ్ అలీని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు,మొయినుద్దీన్, మహమ్మద్ షహీద్‌ను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరు..

కామారెడ్డి క్రైం: ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామానికి చెందిన ధర్ని రాజేందర్ (58) వ్యవసాయం చేసేవాడు. కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో సతమతమై జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో అతడు ఈ నెల 15న గడ్డిమందు తాగి, ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

ఎడపల్లిలో ఒకరు..

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై వంశీచందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన పెంటోల్ల శేఖర్(42) ఈనెల18న తన స్నేహితుడు రమేష్‌తో కలిసి జానకంపేట బైక్‌పై వెళ్లారు. దీంతో వారు బైక్ పైనుంచి పడి గాయపడ్డారు. మరుసటి రోజు శేఖర్ అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకొని వృద్ధుడు మృతి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ధోబిఘాట్ వద్ద ఉన్న షెడ్డుకు గురువారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో షెడ్డులోని ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సీతారామారావు (75) అనే వృద్ధుడు పక్షవాతంతో బాధపడుతుండగా, కొన్నేళ్లుగా షెడ్డులోనే నివసిస్తున్నాడు. ప్రమాదవశాత్తు చెత్తలోని నిప్పు షెడ్డుకు అంటుకోవడంతో సీతారామారావు మంటల్లో కాలిపోయి మృతి చెందాడు. మృతుడి కొడుకు రామేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

ఒకరికి మూడు నెలల జైలు శిక్ష

రెంజల్(బోధన్): దంపతులను దూషించి చేయి చేసుకున్న వ్యక్తికి శుక్రవారం బోధన్ కోర్టు రూ. 10వేల జరిమానాతోపాటు మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. రెంజల్ ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా.. ఎడపల్లి మండలం పోచారం గ్రామానికి చెందిన తాడెం శంకర్ అనే రైతుకు రెంజల్ మండలం దూపల్లి శివారులో భూమి ఉంది. పంటను సాగు చేస్తుండగా కింది పొలం రైతు ఆనందాస్‌బాబు శంకర్‌కు చెందిన బోరు నీటిని అక్రమంగా మళ్లించుకునేవాడు. అనుమానం వచ్చి అతడిని నిలదీయగా శంకర్‌తోపాటు అతని భార్య లక్ష్మీపై చేయి చేసుకున్నాడు. 2019 మార్చి 29న జరిగిన ఈ ఘటనపై బాధిత దంపతులు అదేరోజు రెంజల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయగా, బోధన్ కోర్టులో విచారణ అనంతరం శుక్రవారం అదనపు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ న్యాయమూర్తి నిందితుడికి శిక్ష విధించారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి రెండురోజుల జైలు

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా పోలీసులకు 11మంది పట్టుబడ్డారు. శుక్రవారం వారికి ట్రాఫిక్ సీఐ ప్రసాద్ కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. జడ్జి 11మందికి రూ.15వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. అలాగే ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

లేగ దూడలపై చిరుత దాడి



నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామంలో రెండు లేగదూడలపై చిరుతపులి దాడి చేసి చంపేసింది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన అబ్బయ్యకు మూడు ఆవులు, రెండు గేదెలు ఉండగా గురువారం అర్ధరాత్రి గుట్ట అంచున గల పశువుల పాకలో ఎప్పటిలాగే కట్టేశాడు. అబ్బాపూర్(ఎం) అటవీప్రాంతం నుంచి వచ్చిన చిరుత రెండు లేగదూడలపై దాడి చేసి చంపేసింది. ఉదయం పాకకు వెళ్లిన అబ్బయ్యకు మృతి చెందిన లేగదూడలు కనిపించాయి. కళేబరాలపై ఆనవాళ్లను గుర్తించి, అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చాడు. నిజామాబాద్ రేంజ్ ఆఫీసర్ సంజయ్‌గౌడ్, సెక్షన్ ఆఫీసర్ జెహ్రా, వెటర్నరీ వైద్యులు నరేందర్‌రెడ్డి ఘటన స్థలానికి వచ్చి, చిరుతదాడిగా నిర్ధారించారు. బోనును ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరగా ఉన్నతాధికారులకు నివేదికలు పంపించి, చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఖలీల్‌వాడి/నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీప్రియనగర్ కాలనీలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఇన్‌చార్జి సీపీ సింధు శర్మ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది సదరు గృహంపై దాడి చేయగా నిర్వాహకులతో పాటు ఇద్దరు మహిళలను, ఇద్దరు విటులను పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి నగదుతోపాటు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాటు తుపాకులు స్వాధీనం

బాన్సువాడ రూరల్: మండలంలోని చిన్న రాంపూర్ గ్రామంలో ఒకరి ఇంట్లో రెండు నాటు తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అశోక్ శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామానికి చెందిన ఇసాబిన్ సయ్యద్ అనే వ్యక్తి ఇంట్లో సోదాలు నిర్వహించగా రెండు నాటు తుపాకులు లభించినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నాటు తుపాకులను అడవి జంతువుల వేటకు ఉపయోగించేవారని తెలిసింది.

ఇసుక లారీ సీజ్

మాచారెడ్డి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై అనిల్ శుక్రవారం తెలిపారు. పాల్వంచ మండలం ఫరీదుపేట నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టి ఇసుక లారీని సీజ్ చేసినట్లు తెలిపారు.

కోటగిరి మండలంలో..

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతంగల్ గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి ట్రాక్టర్‌ను పట్టుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దారిదోపిడీ నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్

నిజామాబాద్ రూరల్: రూరల్ మండలంలోని తాళ్ల కొత్తపేట్ వద్ద ఇటీవల జరిగిన దారిదోపిడీ ఘటనలో నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ సురేష్ శుక్రవారం తెలిపారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని సౌత్ రూరల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామానికి చెందిన పంచాల జితేష్ ఈనెల 19న రాత్రివేళ బైక్‌పై జిల్లా కేంద్రం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. రూరల్ మండలంలోని తాళ్లకొత్తపేట్ వద్ద గంగా రైస్‌మిల్‌లో హమాలీ పని చేస్తున్న కుందన్ కుమార్, విజయ్ కుమార్, సుందర్ కుమార్ ముగ్గురు కలిసి జితేష్‌ను అడ్డుకొని, గాయపరిచారు. అనంతరం అతడి వద్ద నుంచి రూ.1000నగదుతో పాటు సెల్‌ఫోన్, సోనీ కెమెరాను దోచుకున్నారు. మరుసటి రోజు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టి, నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన రూరల్ సీఐ సురేష్, ఎస్సై మహ్మద్ ఆరీఫ్‌లను ఏసీపీ అభినందించారు. జితేష్‌కు ముందు చింతకుంటకు చెందిన రాజేశ్వర్ రెడ్డిపై కూడా నిందితులు దాడికి యత్నించగా అతను తప్పించుకున్నాడని తెలిసింది.

బోల్తా కొట్టిన బొలెరో వాహనం



నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్లారం గండీలో శుక్రవారం జిల్లా కేంద్రం పైనుంచి ప్రయాగ్‌రాజ్(కుంభమేళా) వెళ్లివస్తున్న బొలెరో వాహనం బోల్తాపడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బాన్సువాడ, పిట్లం మండలాలకు చెందిన కొందరు వ్యక్తులు బొలెరో వాహనంపై ప్రయాగ్‌రాజ్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మల్లారం గండీ వద్ద వారి వాహనం వర్ని నుంచి వస్తున్న బైక్‌ను తప్పించబోయి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు, బొలెరో వాహనంలో ఉన్న వారికి స్వల్ప గాయాలు అయినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ వివరించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన సైదుగారి సత్తయ్య (37)కు అదే గ్రామానికి చెందిన నాగమణితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. సత్తయ్య తాగుడుకు బానిస కావడంతో పాటు, పలువురి వద్ద అప్పులు కూడా చేశాడు. ఈక్రమంలో ఈనెల 19న వంటలు చేసేందుకు వెళ్తున్నా అని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. జంగంపల్లి చెరువులో శుక్రవారం ఓ వ్యక్తి మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకవచ్చి సత్తయ్య మృతదేహంగా గుర్తించారు. మృతుడి సోదరుడు అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

సిరన్‌పల్లిలో వివాహిత..

నవీపేట: మండలంలోని సిరన్‌పల్లి గ్రామ పరిధిలోని ఒడ్డెర కాలనీకి చెందిన మల్లవ్వ(45) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్ శుక్రవారం తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 12న ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈక్రమంలో శుక్రవారం స్థానిక బావి నుంచి దుర్వాసన రాగా, అందులో మల్లవ్వ మృతదేహం కనిపించిందన్నారు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిందని, భర్త గంగారామ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

హార్వెస్టర్ దగ్ధం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ గంగాటవర్ సమీపంలో నిలిపిన హార్వెస్టర్ వాహనం గురువారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమయ్యింది. బాధితుడు నర్సారెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. భైంసా మండలం కమోల్ గ్రామం నుంచి అతడు ఆర్మూర్ ప్రాంతానికి వ్యవసాయ పనుల నిమిత్తం హార్వెస్టర్‌ను తీసుకువచ్చాడు. రాత్రి డ్రైవర్ హార్వెస్టర్ వాహనాన్ని కోటార్మూర్‌లోని ఖాళీ ప్రదేశంలో పార్కు చేసి వెళ్లాడు. కానీ వాహనంపై ఉన్న విద్యుత్ వైర్ల వల్ల వాహనానికి నిప్పంటుకుందని, పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారన్నారు. అగ్నిమాపకశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారని, వాహనం అప్పటికే పూర్తిగా కాలిపోయిందని బాధితుడు తెలిపారు.

న్యూసెన్స్ కేసులో ఒకరి బైండోవర్

జక్రాన్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన జక్కం సాయిచరణ్‌ను న్యూసెన్స్ కేసులో తహసీల్దార్ కిరణ్మయి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తిరుపతి శుక్రవారం తెలిపారు. ఈనెల 20న పడకల్‌లో రాత్రి సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా డీజే నిర్వహించి ప్రజలకు ఇబ్బంది కలిగించి న్యూసెన్స్ చేశాడన్నారు. దీంతో సాయిచరణ్‌పై కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామన్నారు.